పేదలందరికీ సొంతిల్లే ప్రభుత్వ లక్ష్యం

సాక్షి,భీమవరం: పట్టణంలోని 38,39 వార్డులకు సంబంధించి టిడ్కో లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతో పట్టణంలోని తాడేరు రోడ్డులో నిర్మిస్తున్న టిడ్కో గృహాల్లో ముందుగా 2 వేల మంది లబ్ధిదారులకు స్వాధీనం చేశామన్నారు. మిగిలిన వారికి ప్లాట్లను స్వాధీనం చేసే పనిలో భాగంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కొల్లి ప్రసాద్, పిల్లి ముసలయ్య, పెచ్చేటి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.



టిడ్కో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఇళ్లస్థలాల పట్టాల పంపిణీ

పేదలందరూ సొంతిల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచే స్తుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలంలోని అండలూరు, పెర్కిపాలెం, చింతలకోటి గరువు,మత్స్యపురి, వీరవాసరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం భీమవరం క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్ ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గట్టి నిర్ణయం తీసుకున్నారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను అందించడమే కాకుండా గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షల నిధులను ఉచితంగా ఇస్తున్నామన్నారు. లబ్ధిదారులకు డ్వాక్రా సంఘం ద్వారా మరో రూ. 35 వేలు రుణం పొందే వీలు కల్పించారని వివరించారు. ఇంటి స్థలం లేని పేదలు వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే మూడు నెలల్లో అర్హత కలిగిన వారికి ఇంటి స్థలం కేటాయించనున్నట్లు శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సుందర్‌రాజు, అండలూరు ఎంపీటీసీ సభ్యుడు బొల్లంపల్లి శ్రీనివాస చౌదరి, వీరవాసరం సర్పంచ్ చికిలే మంగతాయారు, నల్లం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

4న తాడేరు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి,భీమవరం: తాడేరు వంతెన నిర్మాణానికి ఏప్రిల్ 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు ఎంఎల్ఏ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం 1929లో నిర్మించిన తాడేరు రోడ్డులో గునుపూడి సౌత్‌ప్రయిన్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుందన్నారు. శిథిల వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ముందుగా రూ.1.90 కోట్లు నిధులు మంజూరు చేయగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అంచనాలు పెంచి రూ.2.30 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో 4వ తేదీ ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు శ్రీనివాస్ చెప్పారు. సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్.లోకేశ్వరరావు, డీఈ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు చేపట్టాలి

పాలకోడేరు: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన వారంతా ఇంటి నిర్మాణాలు చేపట్టాని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. పాలకోడేరు గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ లేఅవుట్‌కు వెళ్లే దారి సరిగా లేకపోవడంపై ఆర్డీఓ స్థానిక అధికారులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. త్వరలోనే పనులు ప్రారంభించాలన్నారు. ఆర్డీఓ వెంట గృహ నిర్మాణ శాఖ డీఈ బీవీ రమణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ ఎస్. మురళీ గంగాధరరావు, ఏఈ నరసింహరావు, ఆర్ఐ నాగభూషణం పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆశీస్సులే సీఎం జగన్‌కు అండ

డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: అక్కచెల్లెమ్మల ఆశీస్సులే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు అండదండలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శుక్రవారం ఉండి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, డ్వాక్రా మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి పీవీఎల్ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. మండలంలోని 1,257 డ్వాక్రా గ్రూపుల్లోని 12,586 మంది సభ్యులకు రూ.15.30 కోట్ల చెక్కును అందజేశారు. పీవీఎల్, రామరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చాడంటే అమలు చేస్తారని అక్క చెల్లెమ్మలకు మరోసారి రుజువు చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని చెప్పారు. ప్రజాసంకల్పయాత్రలో ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానాన్నీ నెరవేరుస్తున్నట్టు తెలిపారు. ఉండి మండలానికి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతలుగా సుమారు రూ.46 కోట్లు అక్కచెల్లెమ్మలకు అందించారని చెప్పారు. అమ్మ ఒడి, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గతంలో చంద్రబాబు చేసిన ఎన్నో వందల దొంగ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక నెరవేర్చాలని అడిగిన ప్రజలను పోలీసులతో కొట్టించారని గుర్తుచేశారు. డబ్బులు ఆశచూపించి నలుగురు ఎమ్మెల్సీలను గెలిచి రాష్ట్రాన్నే గెలిచినట్టు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.



ఉండిలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు రామరాజు

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కార్యదర్శి గలావిల్లి ధనుంజయ, రాష్ట్ర డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొత్రపాటి అనిత, వైస్ ఎంపీపీ దత్తాల సుజాత రాణి, కరిమెరక మల్లికార్జున, కరిమెరక చంద్రరావు, జి.సుందర్ కుమార్, యేడిద వెంకటేశ్వరరావు, రణస్తుల మహంకాళి, బదుగు బాలాజీ, తాటిపట్టి పెదవీరప్ప, సర్పంచ్‌లు ముదునూరి వెంకటసోమరాజు, కొండవేటి సాంబశివరావు, గోగులమండ చినకృష్ణమూర్తి, పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపీటీసీలు గిరడ రమణ, వీరమల్లు సత్యవతి, మున్నలూరి సువర్ణలక్ష్మి, నిమ్మల కేశవకుమార్, రాయి రావులమ్మ, బందెల ప్రమీల, అల్లూరి మాధవి, చింతలపాటి రఘు, బ్యాంకు చైర్మన్లు పేరిచెర్ల సూర్యనారాయణరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, హరివర్మ, సూరవరపు వెంకటాచార్యులు, డ్వాక్రా ఏపీఎం శేషవేణి, సీఏలు, డ్వక్రా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి ఎంతో మేలు

భీమవరం(ప్రకాశం చౌక్): పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రతి ఒకరు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు గుడూరి ఉమాబాల అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమాబాల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ బి.సుజాతరాణీ, పంచారామక్షేత్రం చైర్మన్ కోడే విజయలక్ష్మితో కలిసి పౌష్టికాహార ప్రదర్శన తిలకించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. పీడీ సుజాత రాణీ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ఆరోగ్యకరమైన మిల్లెట్స్, రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి సిరి ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలన్నారు.



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుగుణరాజు, సూపర్‌వైజర్లు సుజాత లక్ష్మీ, సరళ, బేబి సరోజ, పార్వతీ, గీతా, వరలక్ష్మీ, బాలకుమారి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించండి

ఉండి: తల్లీ పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని జిల్లా ఎంపవర్‌మెంట్ అధికారి(డీడబ్ల్యూ అండ్ సీడీఏ) బి.సుజాతరాణి అన్నారు. శుక్రవారం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో ఆకివీడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారంపై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా సుజాతారాణి మాట్లాడుతూ పోషకాహారం ఆవశ్యకతను తల్లికి తెలియజేస్తే పిల్లల్ని కూడా ఆరోగ్యంగా వారే కాపాడుకుంటారని చెప్పారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వంటివాటిపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్ మల్లికార్జునరావు, డాక్టర్ ఎస్ దెబోరామెస్సియానా మాట్లాడుతూ పోషకాహారం ఎక్కువగా చిరుధాన్యాల్లో లభిస్తాయన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సీడీపీఓ వీవీ విజయరత్నం, ఏసీడీపీఓ, సూపర్‌వైజర్స్, ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరపేరంటాలమ్మ జాతర 3 వరకు పొడిగింపు

ఉండి: ఉండి మండలం వెలివర్రు వీరపేరంటాలమ్మవారి 70వ వార్షిక జాతర మహోత్సవాలు ఏప్రియల్ 3వ తేదీ వరకు పొడిగించినట్టు ఆలయ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. మార్చి 31వ తేదీ శుక్రవారంతో ముగియాల్సిన కార్యక్రమాలు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తోన్న భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో మరో మూడు రోజులు పొడిగించినట్టు చెప్పారు. ఈనెల 3వ తేదీ సోమవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు గ్రామ సర్పంచ్ పెన్మెత్స అంజనాదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముదునూరి కొండరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజు తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణాభరణానికి శుక్రవారం జువ్వలపాలెం వాస్తవ్యులు కలిదిండి రాజ్యలక్ష్మీ 8 గ్రాముల బంగారం వారి తండ్రి జంపన కృష్ణమూర్తి రాజు 2 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, రామాయణం సత్యనారాయణ, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందించారు.

డేటా ఎనలిటిక్స్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు

సాక్షి, భీమవరం: డేటా ఎనలిటిక్స్ ద్వారా డేటాను సంరక్షించుకోవడంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డేటాను విశ్లేషించుకోవడం, వ్యాపార సంస్థల భవిష్యత్‌ను ముందస్తుగా అంచనా వేయడం వంటి వాటి ద్వారా డేటా ఎనలెటిక్స్ ప్రయోజనాలను పొందవచ్చునని లండన్‌కు చెందిన లీడ్‌డేటా ఆర్కిటెక్ట్ పెన్మెత్స శిరీష అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో శుక్రవారం డేటా ఎనలిటిక్స్ అనే అంశంపై ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సదస్సులో ఆమె మాట్లాడారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ పి.సురేష్‌వర్మ మాట్లాడుతూ డేటా ఎనలిటిక్స్ ఏ ఏ రంగాల్లో వినియోగిస్తున్నారు? తద్వారా ఎలాంటి ప్రయోజనాలను పొందుతున్నాం? అనే విషయాన్ని వివరించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి, పాలకవర్గ సభ్యుడు పి.రామకృష్ణంరాజు ఎ.కె.యస్.చంద్రశేఖరరావు, కె.రాంబాబు, బి.సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గునుపూడిలో డ్రైడే ఫ్రైడే

భీమవరం(ప్రకాశం చౌక్): పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా గునుపూడిలో ఆయన పర్యాటించారు. వీధుల్లోని ఇంటింటికి వెళ్లి జనంతో ఆయన మాట్లాడారు. నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. డ్రెయిన్ నీళ్లు రోడ్డుపైకి వస్తే వెంటనే మున్సిపాలిటి సిబ్బందికి చెప్పి శుభ్రం చేయించుకోవాలన్నారు. దోమలు విజృంభించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.



గునుపూడిలో డ్రై డే ఫ్రై డే నిర్వహిస్తున్న దృశ్యం

గొరగనమూడిలో ..

పాలకోడేరు: డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు పీహెచ్‌సీ డాక్టర్ రంగం నాయుడు సూచనలతో గొరగనమూడిలో వాటర్ ఫిల్టర్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని పంచాయతీ సిబ్బందిచే నిర్వహించామని హెల్త్ సూపర్‌వైజర్ శంకర్ అన్నారు. పంచాయతీ సిబ్బందికి క్లోరినేషన్ ఏవిధంగా ఉండాలో సూచనలు చేశామన్నారు. గ్రామంలో మంచినీరు, దోమల నివారణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించామని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రమీల, ఆరోగ్య సహాయకుడు, ఎం విజయ ప్రసాద్, ఏఎన్ ఎం వేదకుమారి, ఆశా కార్యకర్తలు ఎంఏఎస్ కుమారి, శాంతి కుమారి పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతుకు విశిష్ట సేవలు

కాళ్ల: సహకార సంఘాల ద్వారా రైతులకు విశిష్ట సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్టు కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశన జయరామకృష్ణంరాజు అన్నారు. సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ పరిధిలో ఉన్న సుమారు 11 గ్రామాల రైతులకు నాణ్యమైన ఎరువులు, వ్యవసాయ రుణాలు, బంగారంపై తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నామని చెప్పారు. సొసైటీలు అందిస్తోన్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గోళ్ల వెంకట రాంబాబు, ముంజేటి రామకృష్ణ, సీఈఓ జంపన సాయిగీత పాల్గొన్నారు.

నెరవేరిన కాళింగగూడెం వాసుల కల

ఆకివీడు: కొల్లేరు తీరంలో కొత్తగా ఏర్పడిన కాళింగగూడెం గ్రామానికి ఎట్టకేలకు మంచినీటి చెరువు ఏర్పడింది. గ్రామస్తులు రెండున్నర దశాబ్దాలుగా చెరువు కోసం పోరాడారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెరువు తవ్వకానికి స్థలం ఏర్పాటు చేశారు. చెరువు తవ్వకం పనులు పూర్తి కావడంతో చెరువులో నీరు నింపేందుకు శుక్రవారం పీవీఎల్ గంగమ్మకు పూజలు చేసి చెరువుకు నీటిని విడుదల చేశారు. చెరువు మధ్య భాగంలో శ్రీకృష్ణుడు విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పీవీఎల్‌కు సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ, రఘుప్రసాద్‌లు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, పొలినాటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ తంగి పుష్కరరావు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, కఠారి కేశవ రావు, కిల్లి రామకృష్ణ, హనుమంతు మధు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



మంచినీటి చెరువుకు నీరు విడుదలకు పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

వెలివర్రులో చెరువుకు నీరు విడుదల

ఉండి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచించారు. శుక్రవారం ఉండి మండలం వెలివర్రు గ్రామ పంచాయతీ మంచినీటి చెరువుకు మరమ్మతుల అనంతరం గ్రామ సర్పంచ్ పెన్మత్స అంజనీదేవి ఆధ్వర్యంలో పూజ చేసి మంచినీటిని పీవీఎల్ విడుదల చేశారు. తాగునీటి వృథాను అరికట్టాని, శివారు ప్రాంతాలకు కూడా తాగునీటిని అందించే ఏర్పాట్లు చేయాలని పీవీఎల్ సూచించారు. పైపులైన్ల లీకేజీ సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముదునూరి కొండరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజు, ఎంపీటీసీ త్రిమూర్తులు, నాగ సంజీవరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని తాడేరు విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శనివారం 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు తొలగించే నిమిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. యనమదుర్రు, దిరుసుమర్రు గ్రామాలకు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ధ్యానం ద్వారా ఆరోగ్యం

వీరవాసరం: ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా చింతలకోటి గరువు పెద రామాలయం వద్ద శుక్రవారం గ్రామ ప్రజల సహకారంతో ఉచిత ధాన్య శిక్షణ, చిన్నారుల నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి మహాలక్ష్మి, ఉప సర్పంచ్ దాసరి మాణిక్యాలు, ఎంపీటీసీ సభ్యులు కొల్లేపర శ్రీనివాసరావు, దాసరి శ్రీరంగనాయకులు, లంకలపల్లి నరసింహరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వచ్ఛతపై అవగాహన



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): స్వచ్ఛతా మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రజలలో స్వచ్ఛత పై అవగాహనా కల్పించేందుకు శుక్రవారం భీమవరం మున్సిపాలిటి కార్యాలయం వద్ద నుంచి నుంచి ప్రకాశం చౌక్ సెంటర్ వరకూ స్వయం సహాయక సభ్యులు , వార్డు సచివాలయ సిబ్బంది స్వచ్ఛత మాషల్ మార్చ్ నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ హెల్త్ ఆఫీసర్ వేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది అందరి బాధ్యతగా భావించాలన్నారు. ఇంటి బయట అంత శుభ్రంగా ఉంటే పట్టణం స్వచ్ఛతగా ఉంటుందని గుర్తు పెట్టుకోలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వామ్యులు కావాలని కోరారు.

వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకోడేరు: పెన్నాడ గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించారు. దీన్ని గ్రామ సర్పంచ్ చిల్లా అనూష సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ మంతెన సుబ్రహ్మణ్యంరాజు శుక్రవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ పునరుద్ధరణతో వేసవిలో ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. గొట్టుముక్కల గోపాల కృష్ణంరాజు, ఎంపీటీసీ ఆదాడ లక్ష్మి తులసీ, ఆరేపల్లి పెద వెంకటస్వామి, సూరగాని నాగేశ్వరరావు, వార్డ మెంబర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలి

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి లోబడి నడుచుకోవాలని తహసీల్దార్ షేక్ హుస్సేన్ సూచించారు. శుక్రవారం పాలకోడేరులో సివిల్ రైట్స్‌డే కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఇంజేటి మరియమ్మ అధ్యక్షతన నిర్వహించారు. హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడికి రాజ్యాంగమే ప్రామాణికమన్నారు. సర్పంచ్ మరియమ్మ మాట్లాడుతూ ఎదుటి వారి హక్కులకు భంగం కలిగించకుండా ప్రవర్తింగాచాలని సూచించారు.

విద్యార్థుల ఇళ్లకు అధ్యాపకులు

ఆకివీడు: దుంపగడప ప్రభుత్వ వీవీ గిరి డిగ్రీ కళాశాలలో చేరాలంటూ అధ్యాపకులు గ్రామాల్లో శుక్రవారం ప్రచారం ప్రారంభించారు. స్థానిక సిద్ధాపురం రోడ్డులో విద్యార్థుల ఇంటికి కళాశాలలో తమ పిల్లల్ని చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. డిగ్రీ కళాశాలలో కంప్యూటర్, సైన్సు, ఆర్ట్స్, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, 150కి పైగా కంప్యూటర్లు, ల్యాబ్ ఉందని తల్లిదండ్రులకు అధ్యాపకులు వివరించారు. విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ చంటిరాజు

పాలకోడేరు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ భూపతి రాజు చంటిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. శృంగవృక్షం ఎంపీటీసీ సభ్యుడు సవరం సత్యకృష్ణ, సర్పంచ్ జంగం సూరిబాబు మాట్లాడుతూ తమ గ్రామాలకు పూర్తిస్థాయి కార్యదర్శులను నియమించాలని కోరారు. పెన్నాడ సర్పంచ్ చిల్లా అనూష మాట్లాడుతూ జగనన్న లేఅవుట్ స్థలాలను అభివృద్ధి చేయాలని కోరారు. పెన్నాడ లబ్ధిదారులకు గొరగనమూడిలో కేటాయించిన స్థలాలు కోర్టు వివాదంలో అయోమయం నెలకొందని చెప్పారు. సర్పంచ్ జంగా సూరిబాబు మాట్లాడుతూ గ్రామంలో ఆక్రమణ భూములను హైకోర్టు ఉత్తర్వుల మేరకు స్వాధీనం చేసు కొనేందుకు సహకరించాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ మురళీ గంగాధరరావు మాట్లాడుతూ ఆక్రమిత భూములను, స్థానిక అధికారులు, గ్రామస్తులు సమష్టిగా సహకరించుకుని స్వాధీనానికి కృషి చేయాలన్నారు. విస్సాకోడే రు సర్పంచ్ మాట్లాడుతూ సమితి హయాం నుంచి తమ గ్రామంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఆకివీడుకు తరలించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. శృంగవృక్షం ఎంపీటీసీ బళ్ల భారతి మాట్లాడుతూ తమ వార్డుల్లో మంజూరైన పనులను జరగనివ్వకుండా సర్పంచ్ సూరిబాబు, వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్‌లు అడ్డుకుంటున్నారని ఆరోపించడంతో ఇరువురి మధ్యా కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. దీంతో ఎంపీపీ చంటిరాజు జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. గరగపర్రు డ్వాక్రా సంఘాల్లో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్ డిమాండ్ చేశారు.